క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ధర్మసాగర్ : రైల్వే యూజర్స్ కాన్సులేటివ్ కమిటీ(ఆర్‌యూసీసీ) సభ్యురాలిగా మండల కేంద్రానికి చెందిన గంకిడి అనూషను నియమిస్తూ రైల్వే శాఖ ఇటీవల ఉత్తర్వు జారీచేసింది. ఈ మేరకు కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం అనూష ఆర్‌యూసీసీ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు చిలుక విజయరావు, బొజ్జపల్లి సుభాష్, గాజుల సంపత్ కుమార్, మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ 'బల్మూరి'కి అభినందనలు



నడికూడ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బల్మూరి వెంకట్ నర్సింగరావును మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కసుమోజుల వేణు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి గణితశాస్త్ర ప్రతిభా పరీక్ష

ఐనవోలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం హనుమకొండ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత శాస్త్ర ప్రతిభా పోటీ నేడు(బుధవారం) నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గణిత ఫోరం మండల అధ్యక్ష, కార్యదర్శులు పాక శ్రీహర్షుడు, ఎ.మహిపాల్ రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి ఆంగ్ల, తెలుగు మాధ్యమాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను పంపాలని కోరారు. మండల స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన మొదటి ముగ్గురిని జిల్లా స్థాయికి ఎంపిక చేసి పంపిస్తామని పేర్కొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

కమలాపూర్ : కమలాపూర్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న (సోమవారం) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం ప్రారంభమయ్యే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

గీతకార్మికుడికి గాయాలు



నడికూడ : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడుకి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని రాయపర్తి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. రాయపర్తికి గ్రామానికి చెందిన బండి రఘుపతి(45) వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడ్డాడు. దీంతో రఘుపతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం

దామెర : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన బోగి వెంకటమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. కాగా వెంకటమ్మ మృతదేహానికి గూడెప్పాడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సూర్య ట్రస్ట్ చైర్మన్ గజ్జి విష్ణు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5,000లు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గజ్జి సురేష్, సూరయ్య, గ్రామస్తులు ఉన్నారు.

శంకుస్థాపన

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ బీముగాని సౌజన్య మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ అంకతి నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

25న టీపీసీసీ సదస్సును విజయవంతం చేయండి

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 25న హైదరాబాద్‌లో ని ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రస్థాయి సదస్సుకు కార్పొరేటర్లు, మండల పార్టీ, బ్లాక్ కాంగ్రెస్, డివిజన్, అనుబంధ సంఘాల, బూత్ అధ్యక్షులు, టీపీసీసీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సదస్సుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని తెలిపారు.

కళ తప్పిన 'ప్రకృతి వనం'



పల్లె ప్రకృతి వనం ఎదుట పిచ్చి మొక్కలు



పల్లె ప్రకృతి వనంలో చెత్తాచెదారం

- వనమంతా చెత్తాచెదారం, ఎండిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

శాయంపేట : గ్రామాల్లో ఆహ్లాదం, ఆరోగ్యం, ఆనందం కోసం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామానికో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. కానీ నేడు వాటిని ఎవరు పట్టించుకోకపోవడంతో ఎండిన చెట్లు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి..పర్యవేక్షించాల్సిన స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.. దీంతో లక్షల రూపాయల ప్రజా ధనం వృథా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెలో ప్రకృతి వనం నిర్మాణానికి 2020వ సంవత్సరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంకల్పించిది. దీంతో ప్రతి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి గ్రామ పంచాయతీకి స్థలాన్ని అందించాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఖాళీ స్థలాన్ని అధికారులు గుర్తించి ప్రకృతి వనానికి కేటాయించారు. అనంతరం వనం నిర్మాణానికి రూ.లక్షలు వెచ్చించి ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పర్యవేక్షణ కరువై వనంలోని చెట్లు ఎండిపోయి, చెత్త చెదారంతో నిండడంతో ఆహ్లాదం కోసం వచ్చే వారే కరువయ్యారు.

సూచిక బోర్డు లేదు..

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనానికి సూచికగా బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో అందులోకి వెళ్లడానికి దారిలేదు. అలాగే గేటు ఎదుట పిచ్చి మొక్కలు పెరిగి ప్రకృతి వనంలోకి వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది.

పల్లె ప్రకృతి వనమంతా చెత్తాచెదారం

పల్లె ప్రకృతి వనంలో చూడడానికి అసహ్యంగా చెత్తాచెదారం, ముళ్ల పొదలు, ఎండిపోయి విరిగిన చెట్లు, ఎక్కడిక్కడే నామా రూపాలు లేకుండా పోయిన సైడ్ ట్రాక్‌లు దర్శనమిస్తున్నాయి.

గ్రామస్తులు నిలదీసిన పట్టించుకోలే..

ఈ నెల 20న గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పల్లె ప్రకృతి వనం ఎండిపోతున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పంచాయతీ అధికారులను నిలదీశారు. ఇప్పటి వరకు పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెత్తను తొలగించడం, చెట్లు ఎండిపోకుండా నీళ్ల పోయడం కాని చేయడం లేదు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆహ్లాదానికి, ఆరోగ్యానికి పల్లె ప్రకృతి వనాలు దోహదపడుతాయని రూ.లక్షలు వెచ్చించి పల్లె వనాలు ఏర్పాటు చేస్తే వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని పల్లె ప్రకృతి వనాన్ని బతికించాలని కోరుతున్నా.

-మారపెల్లి సుధాకర్

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- సీడీపీఓ భాగ్యలక్ష్మి



ఆయాకు స్వీట్ తినిపిస్తున్న సీడీపీఓ భాగ్యలక్ష్మి

ఆత్మకూరు : అంగన్‌వాడీ సహాయకులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ సహాయకులు(ఆయాలు) విధులు, బాధ్యతలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారి పెరుగుదలపై శ్రద్ధ వహించడం, సెంటర్ నిర్వహణ, పరిశీలన, పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందించే అనుబంధ పోషకాహారంపై ప్రేమ బాధ్యతతో అందించి వారి మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం సీనియర్ ఆయాలకు స్వీట్లు తినిపించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, నసీమా, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా రాణించాలి



నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులతో చంద్రశేఖర్ ఆర్య, ఉపాధ్యాయులు

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని లయన్ ఎస్‌వీడీజీ చంద్రశేఖర్ ఆర్య ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని కొండపర్తి జెడ్పీఎస్‌ఎస్ విద్యార్థులకు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ ఆధ్వర్యంలో లయన్ క్వెస్ట్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా నోట్ పుస్తకాలు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన పలు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం కె.రఘునందన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ ఆర్య హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అంకిత భావం గల ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజమణి, జిల్లా కో ఆర్డినేటర్ మార్గం ప్రభాకర్, చార్టెడ్ ప్రెసిడెంట్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు నర్సయ్య, పద్మావతి, శ్యాంసుందర్, శిరీష, విలాసిని, సరస్వతి, మయూరి, రాజయ్య, సురేష్ పాల్గొన్నారు.

గొల్లకురుమల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఎస్సై

దామెర : గొల్ల కురుమల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా గొర్రెల యూనిట్లను మంజూరు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, మండల పశు వైద్యాధికారి దీపిక, లక్ష్మణ్, సంఘం నాయకులు దాడి మల్లయ్య, రవి, మేరుగు శివ, బైకని రాజు, బత్తిని రాజు, మిరియాల రవితో పాటు తదితరులు ఉన్నారు.

సన్మానం

గీసుకొండ : మండలంలోని ఊకల్‌హవేలిలో గల శ్రీనాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, జ్యోతిష్య శాస్త్ర పండితుడు సముద్రాల సుదర్శనాచార్యులను గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సుదర్శనాచార్యులకు అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయం జ్యోతిష్యశాస్త్రం(హస్తముద్రికా శాస్త్రం)లో పీహెచ్‌డీ సీటు రాగా ఆయనను ప్రభుత్వ ఉపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి, మరియపురం ఉపసర్పంచ్ చిరంజీవి తదితరులు శాలువాలతో సన్మానించి అభినందించారు.

'కేవీ'లో డ్రాయింగ్ పోటీలు

కాజీపేట అర్బన్ : మండలంలోని కడిపికొండలో పీఎం శ్రీ కేంద్రీయ వి ద్యాలయ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. సుభాష్‌చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా పరాక్రందివస్ నిర్వహించడంతో పాటు రెండు అంశాలపై డ్రాయింగ్ పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. డ్రాయింగ్ పోటీల్లో నగరంలోని పది స్కూల్స్ విద్యార్థులు పాల్గొని పీఎం చిట్కాలు, చంద్రయాన్, స్పోర్టీవ్ సక్సెస్, వికసిత్ భారత్‌లను చిత్రీకరించారు. ఉత్తమ డ్రా యింగ్‌లకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నిట్ ప్రొఫెసర్ వి.రమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

మామునూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీఎస్‌ఎస్పీ నాలుగు, ఐదు బెటాలియన్ల కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి, టీఎస్‌ఎస్పీ పోలీస్ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, కృష్ణవేణి హైస్కూల్ ఎండీ. పట్నాల శ్రీనివాస్ సూచించారు. గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బెటాలియన్‌లోని క్రీడా మైదానంలో హైస్కూల్స్ హెచ్‌ఎంలు సత్యనారాయణ, శిరీష, కల్యాణ్‌రామ్, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 23,24 తేదీల్లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహం.. ఉల్లాసంగా మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ వి. సురేందర్, అసిస్టెంట్ శ్రీనివాస్, రాంబాబు, సోమని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసం

కేయూ క్యాంపస్: క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఏబీవీపీ నాయకుడు ఏలేటి నాగరాజు అన్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హనుమకొండ జిల్లా శాఖ, సామజగన్‌మోహన్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ హెరిటేజ్ 2024 క్రీడా పోటీలను హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ మైదానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయిలయ్య ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్, ప్రభాకర్, లవన్‌కుమార్, హర్షవర్ధన్, నిఖిల్, సుజిత్, దేవేందర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్సైకి చెక్కు అందజేస్తున్న మధు, రమేష్

దామెర : నేరాలను నియంత్రించడానికి ప్రతి వీధిలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఎస్సై కొంక అశోక్ సూచించారు. మండలంలోని పసరగొండ ఉపసర్పంచ్ పరికరాల మధు రూ.10,000, కొట్టె రమేశ్ రూ.10,000లు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఎస్సైకి మంగళవారం చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని ఇందుకోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

అక్రమ పదోన్నతిని రద్దు చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఓ మహిళా ల్యాబ్ అసిస్టెంట్‌కు సూపరింటెండెంట్‌గా అక్రమంగా పదోన్నతి కల్పించారని ఆ పదోన్నతిని రద్దు ప ర్చాలని రెండోరోజు మంగళవారం కేయూ ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు ఎల్.యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, యూనివర్సిటీ ఇతర బాధ్యులు అధికారులను డిమాండ్ చేశారు. రద్దు పరుస్తామని ఈనెల 22న హామీ ఇచ్చి మీ రు రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయా సంఘాల బాధ్యులు రిజి స్ట్రార్ శ్రీనివాస్‌రావుతో వాగ్వాదాలకు దిగారు. గతంలో సూపరింటెండెంట్ ప దోన్నతి కోసం రాత పరీక్షరాసి ఉత్తీర్ణులైన వారు ఐదుగురు ఉద్యోగులు మంగళవారం కేయూ రిజిస్ట్రార్‌కు విన్నవించి వినతిపత్రాలు ఇచ్చారు. సీనియారిటీ కోటాకింద తమకు కూడా సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించాలని మరో ఇద్దరు మహిళా సీనియర్ అసిస్టెంట్లు రిజిస్ట్రార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు.

వర్క్‌షాప్‌తోనే అవగాహన

కాళోజీ సెంటర్ : వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థుల్లో విషయ అవగాహన పెంపొందుతుందని జిల్లా సైన్స్ అధికారి, జిల్లా ఎన్జీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నగరంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నేషనల్ గ్రీన్ కాప్స్ కార్యశాల(ఎన్జీసీ) నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 50 పాఠశాలల నుంచి సుమారు 150 విద్యార్థులు, 50 మంది ఎన్జీసీ ఇన్‌చార్జ్ టీచర్లకు రాష్ట్ర ఎన్జీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, బృందంచే' పర్యావరణ హిత జీవన శైలి' పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి ని ర్వహించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై, పర్యావరణానికి సంబంధించిన అ నేక అంశాలపై, జీవవైవిధ్య సంరక్షణపై విషయ నిపుణులు శివకరణ్ ఎగ్జిబిట్స్‌తో వివరించారు.

వడిచర్ల శ్రీనివాస్‌కు పలువురి నివాళి



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన నందనం సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్ సోమవారం మృతిచెందగా మంగళవారం పలువురు రాజకీయ నాయకులు అతని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. శ్రీనివాస్ మృతి విషయం తెలుసుకున్న స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు అమరవాది సారంగపాణి వేర్వేరుగా శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట వైస్ ఎంపీపీ తంపుల మోహన్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, ఎండీ అప్సర్, సమ్మెట సుధీర్, రాయపురం సాంబయ్య, మునిగాల సంపత్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

సోమవారం ఉదయం వడిచర్ల శ్రీనివాస్ మృతిచెందగా లండన్‌లో ఉన్న అతని కుమారుడు కమల్‌కు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఇంటికి చేరుకుని తండ్రి మృతదేహం వద్ద బోరున విలపించాడు. 30ఏళ్లుగా ప్రజా జీవితానికి అంకితమై వారి బాగోగులు పంచుకున్నావు కదా.. చాలా మంది వచ్చారు.. వాళ్లకు రేషన్ కార్డులు రాలేదట.. ఇళ్లు కావాలటా.. లేచి చూడు అంటూ తండ్రి మృతదేహం వద్ద విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. దీంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా వందలాది మంది రాజకీయ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తుల నడుమ సాయంత్రం శ్రీనివాస్ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

స్వాతంత్ర్య ఉద్యమకారుడు నేతాజీ



పరకాల: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు



ఆత్మకూరు: నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

- బ్రిటిష్ సేనను ఎదిరించిన మహనీయుడు
- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల : 'జై హింద్' నినాదంతో బ్రిటిష్ సేనను ఎదిరించిన గొప్ప మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ అన్నారు. ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడిన నేతాజీ సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని పరాక్రమ దివస్‌ను పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. 'మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెడుతా' నంటూ దేశం పట్ల తనకున్న ప్రేమాభిమానంతో పాటు గౌరవాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. చివరకు దేశం కోసం ప్రాణాలను సైతం ఇచ్చిన గొప్ప స్వాతంత్ర్య ఉద్యమకారుడని కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ జి.ఓదేలు, అధ్యాపకులు ఎం.రవికుమార్, ఎం.అరుణ, ఎల్.ఇందిరాదేవి, వి.రాజయ్య, ఆర్.కుమారస్వామి, అనిల్‌కుమార్, పి.సుభాషిణి, సీహెచ్ సుస్మిత, రాజశ్రీ, సంజయ్, జి.స్వప్న, సుమలత, రాజు, శ్యాంసుందర్, శ్రీనివాస్, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ అడుగు జాడల్లో నడవాలి

సంగెం : దేశ సేవే జీవిత లక్ష్యంగా పోరాడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అడుగు జాడల్లో యువత ముందుకు సాగాలని యూత్ నాయకుడు పెండ్లి పురుషోత్తంరెడ్డి అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని మొండ్రాయి గ్రామంలో సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వపరిపాలన కోసం బ్రిటిష్‌వారిని ఎదిరించడానికి ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతీయ సైనికుల్లో స్వాతంత్ర కాంక్షను పెంచిన మహనీయుడని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ పాత్ర మహోన్నతమైందన్నారు. ప్రతి పౌరుడు ఆయన స్ఫూర్తితో దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడ కుమారస్వామి, ఎంపీటీసీ కొనకటి రాణిమొగిలి, ఉప సర్పంచ్ పెండ్లి శారదకుమారస్వామి, మాజీ ఎంపీటీసీ కద్దూరి సంపత్, నాయకులు మడత కేశవులు, దామెరుప్పుల చంద్రమౌళి, కక్కెర్ల వీరస్వామి, శేషాద్రి, వార్డు సభ్యులు స్వామి, ప్రశాంత్,కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో 'ఆజాద్ హింద్ ఫౌజ్' వ్యవస్థాపకుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను అంబేద్కర్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నేతాజీని స్మరించుకుంటూ ఆయన కీర్తి ప్రతిష్ఠలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుమాండ్ల శ్రీనివాస్, మిరియాల కుమారస్వామి, ఆనందం, సునీల్, చరణ్, మహేందర్, రాజు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అన్నారు. గ్రేటర్ పరిధిలోని 42వ డివిజన్ ఆదర్శకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్ల్ చైల్డ్ డేను పురస్కరించుకుని మొక్కలు నాటారు.

ఉర్దూ భాష అభ్యున్నతికి కృషిచేయాలి

న్యూశాయంపేట : ఉర్దూ భాష అభ్యున్నతికి పాటుపడాలని వరంగల్ ఇస్లామియా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బహదూర్‌అలీ తెలిపారు. మంగళవారం వరంగల్ ఎల్‌బీనగర్ గోల్డెన్ గెస్ట్‌హౌజ్‌లో ఇటీవల మరణించిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రఖ్యాత కవి మునవర్‌రాణా సంస్మరణ సభలో ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ కవి తాజ్ ముస్తార్ అధ్యక్షతన జరిగిన సభలో బహదూర్‌అలీ మాట్లాడుతూ మునవర్ రాణా తన కవితలతో ప్రజలను ఉత్తేజితులు చేశారని గుర్తుచేశారు.